# సంస్కర్తవా?

— రచన —

బి. వి. వి. ఆర్. సుబ్బారావు

ఎవరునువ్వు? సంస్కర్త వా?......

ఒహోహో! సంస్కర్త వానువ్వు...యిప్పటి వరకూ సంఘాన్ని యేమాత్రం సంస్కరించావు?... ఉపన్యాస వేదికలపై బల్లగుద్ది గొంతుక చించుకొని అరుస్తావు...కాని ఆచరణ శూన్యం...అవునా?

స్త్రీ స్వాతంత్రియం అవుసరం!...

హరిజనోద్ధరణ జరగాలి!...

బాల్య వివాహాలు అరికట్టాలి!...

సనాతనాచారాలు మంటకలపాలి!...

కుల మతభేదాలు పోవాలి!...

స్త్రీ పునర్వివాహాలు చెయ్యాలి!...

సంఘాన్ని సంస్కరించాలి!...అని ధణు తెగిపోయేటట్లు అరుస్తావు...వ్రాస్తావు వ్రాతలు... కథలు...గీతాలు...వ్యాసాలు...సంస్కరణ కోసం ...కాని హృదయపూర్వకంగా చెప్పు చూదాం... ఒక వితంతువుని పెళ్ళాడ్తావా?...మీఆవిడకు నీతో పాటు స్వాతంత్రియం యిస్తావా?

మాలాణ్ణి ముట్టుకొని వాడితో కలసి భోంచేస్తావా...?

నీ కుమార్తెలకు వివాహ స్వాతంత్రియమిస్తావా...?

సనాతనుల నెదిరిస్తావా...?

సాయెబు సహపంక్తిని తింటావా...?

నీవితంతు కుమార్తెకు పెళ్ళిచేస్తావా...?

సంఘాన్ని ఎదుర్కొంటావా...?

అమ్మో...అంత పెద్దపనులే...

వెలి...వెలి...

వితంతువుని పెళ్ళాడ్తే నలుగురూ నవ్వరూ?

మా ఆవిడకు స్వాతంత్రియమిస్తే నెత్తికెక్కి తొక్కదూ...

మాలాళ్ని ముట్టుకోవడమే...ఛండాలుడు.... స్నానం చెయ్యొద్దూ. మళ్ళీ మాయింట్లో మానాయనమ్మ బ్రతకనిస్తుందా...

ఆడపిల్లకు వివాహస్వాతంత్రియమా...అబ్బో ....వాళ్ళు ప్రేమ అని ఏ వెధవనో పెళ్లాడెయ్యరూ?

వితంతువుకు పెళ్ళిచెయ్యడమే ... బ్రతికున్న బంధుకోటితో సంబంధబాంధవ్యాలు త్రెంచుకోవడమే...?

చాలుచాలు...యింక నీ సమాధానాలు... సంతోషించా...మరి నీకీ సంస్కర్త పేరెందుకు... నీబూతు నీవు సవరించుకొని అప్పుడు బైటకు రా... అంతేకాని యీ నేతిబీరకాయ సామ్యంలాంటి ఆ సంస్కర్త బిరుదెందుకు?... యీ వట్టి కుండల చప్పుడెందుకు...? సంస్కర్తవైతే...

ఒక బాలవితంతువుని పెళ్లాడు...

నీభార్యకు స్వాతంత్రియమియ్యి—

హరిజన సేవ చెయ్యి...

సంఘాన్ని ఎదుర్కో...

సనాతనాచారల్ని ఖండించు...

నీవు చేసే పని మంచిదనిపించుకో...

నీవితంతు కుమార్తెలుంటే పునర్వివాహం చెయ్యి...అప్పుడు నీవు నిజమైన సంస్కర్తవు... తెలిసిందా నాయనా...?

అంతేకాని ఏమి చెయ్యలేని నీకీసంస్కర్త బురఖా ఎందుకు బాబూ...

వదిలెయ్యి ... నాయనా ... ఆబురఖా వదలెయ్యి...

ఇక శలవ్.